క్లుప్తంగా

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నరేంద్రపురానికి చెందిన యువ రైతు ప్రగడ రాంబాబు తమ (ప్రగడ) వంశీయుల ఇలవేల్పు అంకాలమ్మ తల్లి ముఖచిత్రంగా రూపొందించిన తెలుగు క్యాలెండర్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం ఆవిష్కరించారు. వీటిని రాజానగరం మండలంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రగడ వంశీయులందరికీ ఇంటింటికీ వెళ్లి అందించనున్నామని రాంబాబు తెలిపారు. నందరాడ సొసైటీ చైర్‌పర్సన్ పబ్బన శ్రీను, నాయకుడు ప్రగడ శివన్నారాయణ పాల్గొన్నారు.

క్లాప్ మిత్ర కుటుంబాన్ని ఆదుకుంటాం

రంగంపేట: సుభద్రంపేట గ్రామానికి చెందిన పెరుమాళ్ళ దావీదు క్లాప్ మిత్రగా పనిచేస్తూ ఇటీవల మరణించారు. బుధవారం నిర్వహించిన సంతాప సభలో దావీదు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు మాట్లాడుతూ దావీదు క్లాప్ మిత్రగా మంచి సేవలు అందించారని, ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: రంగంపేటలో కంటిపూడి ఆనందరావుకు చెందిన పామాయిల్ తోటలో కొలువై ఉన్న సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట: స్థానిక కాకినాడ రోడ్డులోని బాలాజీ జ్యూవెలర్స్ వద్ద వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బుధవారం జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ ప్రారంభించారు. మజ్జిగ, తాగునీరు, ఉగాది సందర్భంగా ఉగాది పచ్చడిని బాటసారులకు పంచిపెట్టారు. ప్రతిరోజు మజ్జిగ, చల్లటి తాగునీరు అందించనున్నట్టు ఆర్యవైశ్య సంఘం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవాసంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు, వాసవీ క్లబ్ అధ్యక్షులు బొండాడ రాజేష్, సౌమ్య, ఆర్య వైశ్య సంఘం ప్రముఖులు మానేపల్లి బంగార్రాజు, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి

సీతానగరం: వెదుళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి సాంబశివరావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ పెందుర్తి బొజ్జియ్య చౌదరి ఆధ్వర్యంలో నాయకులు ఘన నివాళి అర్పించారు. నాయకులు కరుటూరి విశ్వనాథం, పెందుర్తి రాజా, కొత్తపల్లి దోశాలరావు, సానిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఉచితంగా దహన సంస్కారాలు

గోకవరం: స్థానిక హిందూ శ్మశానవాటికలో అనాథ శవాలకు ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహిస్తామని గోకవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాసరి తమ్మన్నదొర తెలిపారు. శ్మశానవాటికలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బుధవారం పెద్దలు నూతన వస్త్రాలు అందజేశారు.

కోడిపందేల శిబిరాలపై దాడి

సీతానగరం: పురుషోత్తపట్నంలో కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్సై కె.శుభశేఖర్ తన సిబ్బందితో దాడిచేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. బుధవారం గ్రామ శివారున కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,050, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

రాజానగరం: ముక్కినాడలో కోడిపందేలు, జూదం ఆడుతున్న వ్యక్తులను రాజానగరం పోలీసులు అరెస్టు చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి పెద్ద మొత్తంలో నగదు, సెల్‌ఫోన్లు, కోడి పుంజులను స్వాధీనపర్చుకున్నట్లు సమాచారం.

మధురపూడి: దోసకాయలపల్లి తోటల్లో కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.750 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు.

బాలుడి అదృశ్యం



మణి సతీష్‌రెడ్డి (ఫైల్)

అనపర్తి: బాలుడు అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం స్థానిక పద్మశ్రీ థియేటర్ ప్రాంతానికి చెందిన మల్లిడి దుర్గాదేవి కుమారుడు మణిసతీష్‌రెడ్డి రాయవరం మండలం లొల్ల మానవతా ఆశ్రమంలో ఏడో తరగతి చదువుతున్నాడు. చదువుపై ఆసక్తి లేదంటూ ఇటీవల ఆశ్రమం నుంచి వచ్చి తల్లి దగ్గరే ఉంటున్నాడు. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం తల్లి నిద్రపోతున్న సమయంలో రూ.200, బట్టల బ్యాగు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాలుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి దుర్గాదేవి బుధవారం అనపర్తి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉగాది.. మది మురిసింది

- ఆలయాలకు భక్తుల తాకిడి
- వేద పండితుల పంచాంగ పఠనం

మధురపూడి: తెలుగువారి తొలి పండగను ఊరూవాడా ఘనంగా జరుపుకొన్నారు. ఉగాదిని పురస్కరించుకుని కోరుకొండలో వేంచేసిన స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి భక్తుల రద్దీ నెలకొంది. శోభకృత్ సంవత్సరం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు కొండపై, దిగువన ఉన్న స్వామివారికి అర్చకులు అభిషేకాలు చేశారు. స్వామివారి దేవస్థానాన్ని దత్తత తీసుకున్న అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం పంచాంగ పఠనంలో శోభకృత్ సంవత్సరంలో జరగబోయే విశేషాలను, రాశి ఫలాలను పండితుడు శర్మ వివరించారు.

సీతానగరం: ఉగాది సందర్భంగా ఆలయాల వద్ద అర్చకులు, పండితులు కొత్త పంచాంగంలో రాశి ఫలాలను రైతులకు, స్థానికులకు వివరించారు. సీతానగరంలోని ఉమా రామలింగేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు. ముగ్గళ్ల శివాలయంలో ఉమా కొమరేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

పల్లెల్లో ఉగాది ఉషస్సు

అనపర్తి: ప్రజలు శోభకృత్ నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలుకుతూ షడ్రుచుల సమ్మిళితమైన ఉగాది పచ్చడిని ఆరగించారు. ఉగాదిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. స్థానిక వీరుళ్లమ్మ అమ్మవారు, శాంతిపురం గణపతి, సరస్వతి సహిత మహాలక్ష్మిదేవి ఆలయం, పాతవూరు బాపనమ్మవారి ఆలయం, ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్థానిక పాతవూరులోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, వీరుళ్లమ్మ ఆలయ ప్రాంగణాల్లో పండితులు రెడ్డి సురేష్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు.

పెదపూడి: తెలుగు ఉగాది శోభకృత్ నామ సంవత్సరాది సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు అన్నారు. సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా పంచాగ శ్రవణం గావించారు. వేంకటేశ్వరస్వామికి చందనోత్సవం నిర్వహించారు.

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ పంచాంగ శ్రవణం చేశారు. అదేవిధంగా స్థానిక దాసరి వారి వీధిలోని రామాలయంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకటసుబ్బారావుశర్మ పంచాంగ శ్రవణం చేశారు.



కోరుకొండలో పంచాంగ పఠనాన్ని నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

బాపనమ్మతల్లికి హరిద్రాభిషేకం

అనపర్తి: అనపర్తి గ్రామదేవత బాపనమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు బుధవారం హరిద్రాభిషేకం నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 600 మంది ముత్తైదువులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్థానిక నల్లకాలువ వద్దకు చేరి బిందెలతో గోదావరి జలాలను తోడ్కొని వచ్చి పసుపు కలిపిన జలాలతో అమ్మవారికి హరిద్రాభిషేకం గావించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు హనుమంతాచార్యులు



పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు రెడ్డి సురేష్‌శర్మ



గోకవరంలో పంచాంగ పఠనం చేస్తున్న వేద పండితుడు ద్విభాష్యం సూర్యవెంకట సుబ్బారావు

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందంజ

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా
- 180 జంటలకు షష్టి పూర్తి మహోత్సవం

రాజానగరం: సమాజంలో సేవా కార్యక్రమాలు చేయడంలో ఆర్యవైశ్యులు ముందు వరుసలో ఉంటారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సేవా భావంతో ఉండే వీరికి రాష్ట్ర మంత్రి వర్గంలో కూడా సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారన్నారు. బుధవారం రాజానగరంలో మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. స్థానిక మాధవీ ఫంక్షన్ హాలులో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి నానబ్బులు అధ్యక్షతన, మండవల్లి వెంకన్నబాబు పర్యవేక్షణలో 180 జంటలకు సామూహిక షష్టి పూర్తి మహోత్సవాలు నిర్వహించారు. అనంతరం మండల ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా మండవిల్లి వెంకటేశ్వర్రావు, ప్రధాన కార్యదర్శిగా గ్రంధి వెంకటసుబ్బారావు, కోశాధికారిగా దవులూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కంకటాల మహేష్, కొత్త బాపిరాజు, ముత్తా రామకృష్ణ, తొంటెపు చినబాబు, సంయుక్త కార్యదర్శిగా పాలూరి ఏడుకొండలు, గౌరవ కోశాధికారిగా మండ రాంబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే రాజా అభినందించారు. ఆర్యవైశ్య సంఘ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి, కార్యదర్శి చినవీరభద్రరావు, కోశాధికారి కృష్ణమోహన్, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీకాకుళపు శివరామసుబ్రహ్మణ్యం, కోనసీమ డిప్యూటీ కలెక్టర్ గ్రంధి వెంకటేష్, రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ప్రతినిధులు తీగల రాజా, బంకు సుబ్బారావు, సముద్రాల రాంబాబు, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ అధ్యాపకులు కుప్పా విశ్వనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే వాసవి సేవాదళ్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.



రాజానగరంలో 180 జంటలకు సామూహిక షష్టి పూర్తి మహోత్సవం



షష్టి పూర్తి చేసుకున్న దంపతుల ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక పాతవూరు ధరణికోట, ఐఎల్‌టీడీ సమీపంలోని బాబానగర్‌లో రూ.31.46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచి నీటి వసతి పనులు దశల వారీగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం బాబానగర్‌లో రూ.9.30 లక్షలు, ధరణికోటలో రూ.22.16 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోగులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామం శివారు ఎల్‌ఎన్ పురంలో ప్రసిద్ధి చెందిన గోగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉగాది సందర్భంగా బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బిక్కవోలు: బలభద్రపురంలో కొలువై ఉన్న కాపు సామాజికవర్గ ఆరాధ్య దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారిని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు.

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో ఉన్న పులగం వారి అచ్చియమ్మ, పేరంటాలమ్మ అమ్మవార్లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.



సీసీ రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



జి.మామిడాడలో గోగులమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

వైభవంగా ముసలమ్మ వారి జాతర



సీతానగరంలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సీతానగరం: స్థానికంగా కొలువైన శ్రీసంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం ఉగాదిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ రద్దీ నెలకొంది. జాతర మహోత్సవం ఈ నెల 25 వరకూ జరుగుతుందని, 26న అన్నసమారాధన ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

గోకవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కొలువైన గ్రామదేవత గుబ్బాలమ్మ ఆలయానికి బుధవారం భక్తులకు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపల్లిలోని గ్రామదేవత నూకాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు.

చల్లా శ్రీనివాస్‌కు ఉగాది పురస్కారం



మంత్రి వేణు నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్

బిక్కవోలు: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం జరిగిన ఉగాది వేడుకల్లో వర్ధమాన కవి చల్లా శ్రీనివాస్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఉగాది కవి పురస్కారంతో సత్కరించారు. శ్రీనివాస్ రచించిన 'ఊరూరా ఉగాది కవిత' పల్లెల్లో జరుపుకునే ఉగాది శోభకు అద్దంపట్టి ఆహూతులను అలరించింది. మెళ్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ రామచంద్రపురం మోడరన్ జూనియర్ కాలేజీలో అకడమిక్ అడ్వైజరుగా పని చేస్తున్నారు. ఆయనను మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీరావు అభినందించారు.

క్షతగాత్రుడి ఆరోగ్యంపై ఆరా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాత తుంగపాడుకు చెందిన వెంకట లోవరాజును గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అపస్మారక స్థితికి చేరుకోగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితుడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని వైద్యులు తెలిపారు. వెంటనే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వయంగా మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స అందే విధంగా చూడాలని సూచించారు. ఎటువంటి సహాయం అవసరం ఉన్నా వెంటనే సంప్రదించాలని బాధితుడి స్నేహితులకు ఫోన్ నంబర్ ఇచ్చారు.

వైద్య విద్యార్థి వెంకటేష్ అందరికీ ఆదర్శం

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి బసవ వెంకటేష్ అందరికీ ఆదర్శమని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు అన్నారు. ఆల్ ఇండియా స్థాయి నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో 1,115 ర్యాంక్ సాధించిన సందర్భంగా వెంకటేష్‌ను ఉగాది పర్వదినం సందర్భంగా తొర్రేడు ఓనువులమ్మ ఆలయంలో సత్కరించారు. తిరుమలరావు, వెంకటనగరం మాజీ సర్పంచ్ ఉప్పులూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై వెంకటేష్‌ను పూలమాలలతో సత్కరించారు. తిరుమలరావు మాట్లాడుతూ పదో తరగతి వరకూ తొర్రేడులో తెలుగు మీడియంలో చదువుకుని ఈ స్థాయికి రావడం గర్వకారణమన్నారు. నున్న తిరుమలరావు, ఉప్పులూరి సత్యనారాయణలు నగదు బహుమతిని చెక్కుల రూపంలో అతనికి అందజేశారు. వైద్య విద్యార్థి వెంకటేష్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి చేరడానికి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు, ఉప్పులూరి సత్యనారాయణ కారణమన్నారు. ఎంసెట్‌లో 2016లో 700 ర్యాంకుతో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశానని, పీజీలో ఎండీ రేడియేషన్ కోర్సు చేయాలని ఉందన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అంతకు ముందు నున్న తిరుమలరావును సత్కరించారు.



వెంకటేష్‌కు చెక్కులను అందజేస్తున్న నున్న తిరుమలరావు, ఉప్పులూరి సత్యనారాయణ

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

24 మంది అరెస్ట్

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి, పాలమూరు, పులుగుర్త గ్రామాల పరిధిలో పేకాట శిబిరాలపై అనపర్తి పోలీసులు దాడి చేసి 24 మందిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం దుప్పలపూడి గ్రామ శివారులో రెండు పేకాట శిబిరాలపై దాడి చేసి 8 మందిని, పాలమూరు గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న మరో శిబిరంలో 11 మందిని, పులుగుర్తలో పేకాడుతున్న 5 మందిని అరెస్ట్ చేశారు. ఆయా దాడుల్లో మొత్తంగా రూ.21,250 నగదును స్వాధీనం చేసుకున్నారు.